కథానిక

# పూర్తికాని కథ

సాకీ

ఆ రోజున గాలుపు ఎక్కువగావుంది. రైలు కోసం ఎదురుచూస్తూ ప్లాట్‌ఫారంమీద నీడను నించున్నాను. కాసేపటికి బండి వొచ్చింది. నా కెదురుగా ఆగిన చిన్న యింటర్ క్లాసు బండిలో ఎక్కేను. అప్పటికే దాంట్లో ఒక ముప్ఫై అయిదుసంవత్సరాల స్త్రీ, ముగ్గురు పిల్లలు, ఏభైయేళ్ళ తాతగారు వున్నారు. ఆవిడ నాగరీకంగా చదువుకున్నదానిలా కన్పించింది. ఆ ముగ్గురూ ఆవిడ పిల్లలు. వాళ్లు వొకబెర్తు ఆక్రమించుకున్నారు. ఎదురుగుండా దానిమీద కిటికీమూల తాతగారు జేరబడ్డారు. ఆ పిల్లల్లో పెద్ద పిల్లకు పది, రెండో పిల్లకు ఎనిమిది, ఆఖరివాడికి అయిదుసంవత్సరాలు వుంటాయి. పిల్లలు కిటికీదగ్గర మూగి, పొలాల్లోకి చూస్తున్నారు. చెమటలు తుడుచుకుని ఓ మూల చతికిలపడి, యీ సింహావలోకనం కావించేసరికి బండి బయల్దేరింది. ఆవిడ ప్రతి వాక్యాన్నీ 'వొద్దు' అన్న ఆజ్ఞతో ప్రారంభిస్తూంది. పిల్లలేమో- 'ఏం?' అన్నదాంతో తిరిగి ప్రశ్నిస్తున్నారు.

'వొద్దు, రవీ! వొద్దు!' అంది ఆవిడ, చిన్న పిల్లాడు కిటికీలోంచి బయటకు తలపెట్టి యింజన్ కేసి చూస్తూంటే.

'ఏం?' అన్నాడు రవిగాడు.

'వొద్దు! సునందా!' అంది ఆవిడ మళ్లీ, రెండో పిల్ల బెర్తుమీద చేత్తో కొట్టి దుమ్ము రేపుతోంటే.

'ఏం కొడితే?' అంది సునంద. వాళ్ళ తిరుగు ప్రశ్నలకు సమాధానం చెప్పకుండానే, పొలాల కేసి చూశమని పిల్లలందర్నీ ఆహ్వానించింది. రవి మళ్ళీ ప్రశ్నించాడు.

'ఆవుల్ని ఆ పొలంలోంచి తోలుకుపోతున్నారేం?'

'ఇంకో పొలంలో గడ్డిబాగావుందని కాబోలు' అంది ఆవిడ.

'ఈ పొలంలోకూడా గడ్డి చాలానేవుంది కదూ?'

'ఇంకో పొలంలో గడ్డి యింతకంటే మంచిది.'

'ఎందుచేత?' వెంటనే వచ్చింది ప్రశ్న.

'రవీ! ఆ గొర్రెలు చూడు' అంది ఆవిడ వాడి దృష్టి మరల్చే ప్రయత్నంలో. రైలు కట్ట పొడుగునా పొలాల్లో గొర్రెలూ, మేకలూ, ఆవులూ చూస్తూనేవున్నారు పిల్లలు. అందుచేత, యిది వాళ్ళదృష్టి మరల్చలేకపోయింది.

'ఆయింకో పొలంలో గడ్డి ఎంచేత మంచిదే? అన్నాడు రవి.

ఈ సంభాషణంతా, ఆ తాతగారు కూడా శ్రద్ధగా, చిరునవ్వుతో వింటున్నాడు. ఆయన చిరునవ్వు చూచి, ఎందుకోనని ఆవిడ ఆలోచనలో పడింది. కాని రెండో పొలంలో గడ్డి, ఏకారణం చేత మంచిదో, ఇంకా నిర్ణయానికిరాలేదు ఆవిడ. ఇంతలో సునంద, అందరిదృష్టినీ ఆకర్షించింది 'ఆజా ఆజా' అనేపాటతో. పాపం, సునందకు మొదటిచరణం మాత్రమే వొచ్చు. అయినా పట్టుదలతో పాడుతూంది- ఆ వొక్క చరణమూ, మధ్యన ఆపకుండా. వెయ్యిసార్లు పాడటానికి ఎవరూ పందెంవెయ్యలేదు కదా అనిపించింది. అదేనిజమయితే, యీ అమ్మాయి, థంకావాయించి మరీ నెగ్గుతుంది.

'కథ చెప్తాను. రండి దగ్గరగా!' అంది ఆవిడ. పిల్లలు కొంచెం బెట్టుచేశారు కథవినడానికి. బహుశా ఆవిడ కల్పనాశక్తి వాళ్ళకు అనుభవమే ఏమో. సన్నగొంతుకతో ఆవిడ కథ ప్రారంభించింది. వాళ్లు అడ్డుప్రశ్నలు తెగవేస్తున్నారు. ఆ కథ, ఒక బుద్ధిమంతురాలైన అమ్మాయిని గురించి. ఆ అమ్మాయి యొక్క అందం, తెలివితేటలూ, మంచితనం చూసి, అందరూ ప్రేమించేవారు. ఒక రోజున ఆంబోతు ఆ అమ్మాయిని కుమ్మెయ్య బోతూంటే అంతా వచ్చి రక్షించేరు. ఇదీ కథ.

'ఆ అమ్మాయి మంచిది కాకపోతే ఎవ్వరూ రక్షించివుండరా ?' అంది పెద్ద అమ్మాయి. సరిగ్గా అదే ప్రశ్న తాతగారికికూడా తట్టింది.

'రక్షించివుండరు' అంది ఆవిడ కుంటి సమాధానంగా. 'ఆ అమ్మాయి చాలా మంచిది కాకపోతే, వాళ్ళంత త్వరగా పరుగెత్తి రక్షించి వుండరు.'

'ఇంత చవట కథ నే నెప్పుడూ వినలేదు' అంది పెద్ద పిల్ల.

'ఈ కథ నేను పూర్తిగా విననే లేదు. అంత అసహ్యంగావుంది' అన్నాడు రవి.

సునంద ఏమీ విమర్శ చెయ్యలేదు కాని, ఆజా ఆజా పాట మళ్ళీ దృఢ నిశ్చయంతో అందుకుంది.

'కథలు చెప్పడంలో మీ కంతగా ప్రవీణత లేదను కుంటాను' అన్నారు తాతగారు, కలుగ జేసుకుని.

'చిన్న పిల్లలు అర్థం చేసుకుని, హర్షించే కథలు చెప్పడం చాలాకష్టమండీ!' అంది ఆవిడ.

'నేనల్లా అనుకోను' అన్నారు తాతగారు.

'అయితే మీరో కథ చెప్పి చూడండి' అని సవాలుచేసింది ఆవిడ. పిల్లలు ముగ్గురూ ఆయన చుట్టూ చేరేరు. ఆయన కథ ప్రారంభించాడు.

'అనగనగా ఒకపట్టణం. ఆ పట్టణంలో సుశీల అని ఒక అమ్మాయి వుంది. అందమయింది, సద్గుణవతికూడా' ఈ కథా ప్రారంభంకూడా వాళ్ళమ్మ చెప్పే కథలలాగనే వుండటంచేత, పిల్లల వుత్సుకత సగం తగ్గిందప్పుడే.

'చెప్పిన పనులన్నీ చేసేది, ఎప్పుడూ నిజం చెప్పేది. పెద్దలయెడ భయభక్తులుకలిగి, శుభ్రంగా వుంటూ శ్రద్ధగా చదువుకునేది.'

'మంచి అందంగా వుంటుందా?' అంది పెద్ద పిల్ల.

'మీ అంత అందంగావుండదు కాని, ఆమె మంచితనంమాత్రం మహాఘోరమైంది' శ్రోతల్లో వుత్సాహం వెల్లివిరిసింది, 'ఘోరమైన మంచితనం' అన్న ప్రయోగం వినగానే.

'ఆ అమ్మాయియొక్క మంచితనం గుర్తించి, స్కూలువారు మూడు మెడల్స్ బహూకరించారు. వాటిలో ఒకటి వినయానికీ; రెండవది శుభ్రతకీ; మూడవది మంచితనానికీ. అవి కంచుతో చేసిన మెడల్సేమో, నడుస్తూంటే ఘుల్ ఘుల్ మనేవి. ఆ పట్టణపు జమీందారుగారు ఆ అమ్మాయి సంగతి విని, వూరి బయటనున్న తమ పెద్ద పూలతోటలో ప్రతి ఆదివారం ఆడుకోడానికి అనుమతి యిచ్చారు. అది చాలా అందమైన పూలతోట. పిల్లనెవర్నీ దాంట్లోకి రానివ్వరు. అందుచేత సుశీలకు యీ అవకాశం దొరకడం వొకవిధమైన గౌరవం అన్నమాట.'

'అక్కడ గొఱ్ఱెలేమేనా వున్నాయా?' రవి.

'లేవు, గొఱ్ఱెలులేవు' అన్నారు తాతగారు.

'ఏం! ఎందుచేత లేవు?' అన్న రవిగాడి ప్రశ్న మళ్ళీ ప్రత్యక్షమయింది.

'ఆ జమీందారుగారి తల్లి కొకనాడు దేవుడు కలలో కనిపించి, ఆమె కొడుకు, గొఱ్ఱెపోటుచేత కాని, గడియారం మీద పడటంచేత కాని చనిపోతాడని చెప్పేడుట. అప్పటినుంచీ, భవనంలో గడియారాలు లేవు; తోటలో గొఱ్ఱెలూ లేవు.'

తాతగారి, ఆ సమాధానానికి ఆవిడ ఆశ్చర్యపోయి నోరు తెరిచింది.

'జమీందారుగారు గొఱ్ఱెచేత చచ్చిపోయాడా లేక గడియారంమీద పడటంచేతా?' అన్నాడు రవి.

'ఆయన నింకా బతికేవున్నాడు. అందుచేత ఆ కల నిజమవుతుందో లేదో చెప్పలేం! అయితే ఆ తోటలో సీమ కుందేళ్లు చాలావున్నాయి.'

'ఏ రంగువి?'

'అచ్చంగా తెల్లవి. అచ్చంగా నల్లవి. తెలుపు నలుపు మచ్చలవి. బూడిద రంగువి. అనేక రకాలున్నాయి. అక్కడికి వెళ్ళేటప్పుడు, తోటలో పువ్వు లేమీ కొయ్యనని, వాళ్ళమ్మకు వాగ్దానం యిచ్చి వచ్చింది సుశీల. తీరాచూస్తే ఆ తోటలో పువ్వులే లేవు. పువ్వులున్నట్లయితే తన వాగ్దానం నిలుపుకుని మంచితనం ప్రదర్శించేదే. మరి యిప్పుడా అవకాశం లేకుండా పోయింది.'

'పూలతోటలో పువ్వు లెందుకని లేవు?' అన్నాడు రవి.

'జమీందారుగారికి కుందేళ్ళంటే యిష్టం. తోటమాలి చెప్పేడు- పువ్వులో కుందేళ్లో ఏవో ఒకటేతప్ప, రెండూ తోటలో పెరగడం అసంభవం అని. జమీందారుగారు; పువ్వులు లేక

పోయినాసరే, పూలతోటలో కుందేళ్ళని పెంచ డానికే నిశ్చయించారు.'

ఆయన నిశితమైన మేధాసంపత్తికి; నివాళు లర్పించారు పిల్లలు. అదే, యింకోరయితే, వెధవ కుందేళ్లు పోతేపోయాయని పువ్వుల్ని పెంచేవారు. ఇట్లాంటి చిన్నవిషయాల్లోనే ప్రదర్శితమౌతుంది తెలివి.

'ఆవుద్యానవనంలో, అందమైన నీటికుండలో రంగురంగుల చేపలు తపతపకొట్టుకుంటూ యీదు తున్నాయి. అక్కడ పలురకాల ఫలవృక్షా లున్నాయి. ఆచెట్లమీద షికార్లుకొట్టే రామచిలక లకు సినిమాపాట లన్నీ వొచ్చు.'

'ఆహా ఆహా వొచ్చునా?' అంది సునంద అపనమ్మకంగా.

'వొచ్చును. సుశీల చాలా సంతోషంతో అక్కడ విహరిస్తూ, తన మంచితనంమూలానే కదా, యిల్లాంటి మహదవకాశం దొరికిందని గర్వ పడింది. ఆ మెడల్సు మూడూ ఘల్ మని, సాక్ష్య మిచ్చాయి. ఇంతలో ఒక తోడేలు, వూరిబయటి చిట్టడవిలోంచి వచ్చింది- రాత్రి భోజనానికి కుందేల్ని పట్టుకుపోదామన్న ఆశతో.'

'దానిరంగు ఎట్లాంటిది?' అన్నాడు రవి.

'మట్టిరంగు. నిప్పులుకక్కుతూన్న బూడిదరంగు కళ్లు, నల్లటినాలిక, పదునైన కోరలు కలిగి, చాలా భయంకరంగా వుంది. తోడేలుకు సుశీల కన్పించింది ముందరగా. అది తనకేసి రావడం చూసి, "యీ తోటలోకి నన్నెందుకు రానిచ్చే వురా దేవుడా!" అని నిట్టూర్చింది సుశీల. అతి త్వరగా పరుగెత్తి, ఒకమూలగా వున్న తులసి మొక్కల గుబురులో దూరింది. తోడేలు కూడా నాలికవ్రేలాడేసుకుని గుబురుదగ్గర తిరుగుతూందే కాని, తులసిమొక్కల వాసనలో సుశీలను పసికట్ట లేకపోయింది. ఇంకా ఆ చుట్టుపక్కలే తిరుగు తూంది. సుశీల భయంచేత వొణికింది. మెడల్సు మూడూ ఘల్ మన్నాయి. ఆ చప్పుడు విని, తోడేలు, వెంటనే గుబురులోదూరి సుశీలను బయటి కీడ్చి, పులుసులోకి ఎముకయినా మిగలకుండా తినేసింది. ఆ అమ్మాయి తొడుక్కున్న చెప్పులూ, పీలికలయిపోయిన గౌనూ, మూడు మెడల్సూ తప్ప, యింకేం మిగలలేదు.' అని కథ ముగించారు తాతగారు.

'కుందేళ్లేమయినా చచ్చిపోయాయా?'

'లేదు. అన్నీ పారిపోయాయి.'

'కథ మొదట బాగులేదు కాని, చివర చాలా బాగుందికదర్రా' అంది సునంద.

'నేను విన్నవాటిలోకల్లా యిదే మంచి కథ' అంది పెద్దపిల్ల. 'ఇది తప్ప, యింకో మంచి కథనే విననేలేదు' అన్నాడు రవి.

'ఇల్లాంటి అసభ్యమైన కథలు పిల్లలకు చెప్ప కూడదు. వాళ్ళకిన్ని సంవత్సరాలనుంచీ నేర్పుతూన్న నీతులన్నీ దీంతో ఆఖరు' అంది ఆవిడ విసుగ్గా.

'మీరు వాళ్ళని ఒక్క నిమిషంకూడా అదుపులో వుంచలేకపోయేరు. నాకథ వాళ్ళదృష్టి నాకర్షించి సంతోష పెట్టింది. అదే చాలు, మీ నీతు లన్నిటికన్నా' అంటూ తాతగారు దిగి పోయారు, స్టేషన్లో బండి ఆగగానే. పాపం, ఆ విడ నిక బతకనివ్వరు యీ పిల్లలు, ఆయన చెప్పిన లాంటి 'అసభ్యమైన' కథలే చెప్పేదాకా.

అనువాదం: 'అవంతి'


## ఏజంట్లు కావాలి

ఈ దిగువ ప్రదేశాలలో తెలుగు స్వతంత్ర అమ్మేందుకు ఏజంట్లు కావాలి. వ్యాపారానుభవముండి కోరిన ధరావతు చెల్లించగల్గినవారే వ్రాయవలెను.

| | |
|---|---|
| పాలకొల్లు | నరసాపురం |
| గురుజాల | రాజోలు |
| కంకిపాడు | కాళహస్తి |
| తిరుపతి | నరశీపట్నం |
| | (విశాఖజిల్లా) |

మేనేజరు:-

**తెలుగు స్వతంత్ర**

156, లాయడ్స్ రోడ్డు,

రాయపేట, మద్రాసు 14